క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్‌గా శేషాద్రి బాధ్యతల స్వీకరణ



రేపల్లె రూరల్: రేపల్లె మున్సిపల్ కమిషనర్‌గా బీఆర్ఎస్ శేషాద్రి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తూ ఎన్నికల సాధారణ బదిలీలో భాగంగా రేపల్లె వచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ శేషాద్రి మాట్లాడుతూ గతంలో బాపట్ల మున్సిపాలిటీతో పాటు పెద్దాపురం, సామర్లకోట, పలాసలో మున్సిపల్ కమిషనర్‌గా పని చేశానన్నారు. రేపల్లె పట్టణంలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని చెప్పారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్య లేకుండా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు.

ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు పూర్తి హక్కులు



చుండూరు(వేమూరు): జగనన్న కాలనీల్లోని ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు పూర్తి హక్కులు కల్పించడం జరిగిందని ఎంపీపీ జాలాది రూబేను తెలిపారు. చుండూరు మండలంలోని మున్నంగివారి పాలెం గ్రామ సచివాలయంలో బుధవారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 1546 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు.1145 మందికి పట్టాలు పంపిణీ చేయడం జరిగిందని చెప్పారు. జగనన్న కాలనీల్లోని లబ్ధిదారులకు శాశ్వత పట్టాలు ఇచ్చేందుకు ప్రతి గ్రామ సచివాలయంలో పట్టాల రిజిస్ట్రేషన్లు చేయడం జరిగిందని తెలిపారు. మండలంలోని వలివేరు గ్రామంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాట్ల సౌజన్య లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పంది పాటి ఏసు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గాదె శివరామకృష్ణా రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు అమర్తలూరు ప్రవీణ్, కొండ శివప్రసాద్ రెడ్డి, సర్పంచ్ అమ్మిశెట్టి శ్రీరామమూర్తి, మహిళలు పాల్గొన్నారు.

ఎంపీడీవో నేతాజీ బదిలీ



కర్లపాలెం: కర్లపాలెం ఎంపీడీవోగా పని చేస్తున్న నేతాజీని ఎన్నికల విధుల్లో భాగంగా మంగళగిరికి బదిలీ చేశారు. మంగళగిరి ఎంపీడీవోగా పనిచేస్తున్న రాఘవేంద్రనాథ్‌ని కర్లపాలెం ఎంపీడీవోగా బదిలీ చేశారు. ఈ సందర్భంగా కర్లపాలెం నుంచి బదిలీపై వెళుతున్న ఎంపీడీవో నేతాజీని బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యారం వనజ, ఈవోపీఆర్డీ ఎలీషాబాబు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సత్కరించారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలి

నియోజకవర్గ ఎన్నికల అధికారి వసంతరాయుడు



వేమూరు: సార్వత్రిక ఎన్నికలకు నియోజకవర్గంలోని సమస్యాత్మకమైన పోలింగ్ బూత్‌లను గుర్తించాలని నియోజక వర్గ ఎన్నికల అధికారి వసంత రాయుడు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ ఎన్నికల సెక్టారు అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యాత్మక పోలింగ్ బూత్‌లలో అదనంగా బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులకు సూచించారు. ప్రతి పోలింగ్ బూత్‌లో మౌలిక సదుపాలయాలు ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు ఆదేశించారు. ఎన్నికల కోడ్ విడుదల చేయక ముందే పోలింగ్ బూత్‌లలో మౌలిక సదుపాయాలు పూర్తి చేయాలని సూచించారు. రేపల్లె డీఎస్పీ తుపాకుల మురళీ కృష్ణ, తహసీల్దారు వి కిరణ్, వేమూరు, చుండూరు సీఐలు పసుపులేటి రామకృష్ణ, శ్రీనివాసరరావు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం

వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో శ్రీ కోదండ రామస్వామి వారి దేవాలయ పునః ప్రారంభోత్సవం, నూతన విగ్రహ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమాలలో భాగంగా బుధవారం ప్రతిష్టా మూర్తులైన స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు క్రోవి ప్రభాకరమూర్తి నిర్వహించగా ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమాలను ధూళిపూడికి చెందిన జానపాటి లీలావేణుగోపాల శర్మ ఆధ్వర్యంలో 14 మంది రుత్వికులతో నిర్వహించారు.

‘సిద్ధం’ సభను విజయవంతం చేద్దాం

- వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు
- భట్టిప్రోలులో సభ సన్నాహక సమావేశం ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు

భట్టిప్రోలు: ‘సిద్ధం’ సభకు ప్రతి బూత్ కమిటీ నుంచి కార్యకర్తలు, అభిమానులను సంసిద్ధం చేయాల్సిన బాధ్యత ఆయా బూత్ కన్వీనర్లపై ఉందని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పిలుపునిచ్చారు.భట్టిప్రోలు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో బుధవారం సిద్ధం సభకు సంబంధించి బూత్ కమిటీ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ సభ నిర్వహణకై చేయవలసిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలను గూర్చి చర్చించారు. ఈ నెల 3న బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గం మేదరమెట్లలోని కొరిసపాడులో సభ నిర్వహించాల్సి ఉండగా 10వ తేదీకి వాయిదా పడిందని తెలిపారు. ఈ బహిరంగ సభ ద్వారా సరికొత్త చరిత్ర లిఖించడానికి జగనన్న సైన్యం సిద్ధంగా ఉండాలని కోరారు. గతంలో ఏ ప్రభుత్వం, ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా జగనన్న ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజారంజకమైన పాలన చేసిందన్నారు. అన్ని వర్గాలకు సమంజసమైన మ్యానిఫెస్టో రూపకల్పనపై కసరత్తు జరుగుతుందని త్వరలోనే దీనిని సీఎం జగన్ ప్రకటిస్తారని తెలిపారు. భట్టిప్రోలు మండలంలోని 110 బూత్‌ల నుంచి సభకు బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, సర్పంచ్ దారా రవికిరణ్మయి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు(నాని), వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం



విగ్రహ మూర్తులను గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి గ్రామంలోని వేణు గోపాలస్వామి వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ హనుమత్ లక్ష్మణ సీతా సమేత శ్రీరామచంద్రస్వామి వారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలలో భాగంగా బుధవారం గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు జరిగాయి. గురువారం మధ్యాహ్నం యంత్రస్థాపన, కుంభాభిషేకం అనంతరం శ్రీ సీతారామ కల్యాణం జరుగుతుందని శ్రీ సీతారామ కాపు సేవా సంఘం నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరుగుతుందని పేర్కొన్నారు. విగ్రహాలను స్థానికులు శ్రీనివాసరావు, కనకారావు, బాలసుబ్రహ్మణ్యం, నారాయణరావు, నాగేశ్వరరావులు అందించినట్లు పేర్కొన్నారు. పూజా కార్యక్రమాలు పరాశరం విజితేంద్ర ఆధ్వర్యంలో దీవి నాగ శేషాచార్యులు నేతృత్వంలో జరిగాయి.

ఘనంగా టైలర్స్‌డే వేడుకలు



యూనియన్ జెండాను ఆవిష్కరిస్తున్న దర్జీలు



విలియం హోవే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దర్జీలు

కర్లపాలెం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను దర్జీలు వినియోగించు కోవాలని కర్లపాలెం మండల ఫ్రెండ్స్ టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ సుభానీ కోరారు. టైలర్స్ డే దినోత్సవం సందర్భంగా బుధవారం కర్లపాలెం సెంటర్‌లో తమ అసోసియేషన్ కార్యాలయం వద్ద టైలర్లంతా యూనియన్ జెండాను ఆవిష్కరించి కుట్టు మిషన్ కనిపెట్టిన విలియం హోవే చిత్రపటంతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం హోవేకు నివాళులర్పించారు. అనంతరం సీనియర్ టైలర్లను యూనియన్ కార్యాలయంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టైలర్స్ యూనియన్ కార్యదర్శి ఎస్‌కె బుజ్జి, ఉపాధ్యక్షుడు జి.బాజీ, ట్రెజరర్ పఠాన్ సర్దార్ ఖాన్ పాల్గొన్నారు.

దర్జీలకు విద్యుత్‌లో రాయితీ ఇవ్వాలి

బాపట్ల: దర్జీలకు విద్యుత్‌లో సబ్సిడీ ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేయాలని ప్రగతి టైలర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు అలపర్తి నాగేశ్వరరావు కోరారు. టైలర్స్‌డే సందర్భంగా బుధవారం స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో కుట్టు మిషన్ సృష్టికర్త విలియం హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అలపర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ కుట్టు మిషన్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, సబ్సిడీపై విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో అలపర్తి శ్రీనివాసరావు, వేల్పుల వెంకటేశ్వర్లు, మోదుగుల భాస్కరరావు, ఉప్పలపాటి మాధవరావు, వేల్పూరి శ్రీనివాసరావు, షేక్.జిలాని, ఎస్.కె.అల్లాభక్షు, పొన్నాడ శ్రీనివాసరావు, షేక్ మౌలా సాహెబ్, షేక్ పీరా,షేక్ ఖాదర్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

చెరుకుపల్లి: టైలర్స్‌డేను పురస్కరించుకొని మండల కేంద్రంలోని బాపూజీ టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ డేను ఘనంగా నిర్వహించారు. తొలుత దర్జీలంతా విలియం హోవే చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. టైలర్స్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఐలాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. టైలర్ వృత్తిలో సీనియర్‌లను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జి శ్రీనివాసరావు, కార్యదర్శి ఎస్‌కే బాషా తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: టైలర్స్ డేను పురస్కరించుకుని బుధవారం భట్టిప్రోలులో కొలువైన శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో కుట్టుమిషన్ పితామహుడు విలియం హోవే చిత్రపటానికి టైలర్లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఇల్లు లేని టైలర్లను గుర్తించి పక్కా ఇళ్లు నిర్మించాలని, వృద్ధాప్య పింఛన్లు ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో భట్టిప్రోలు, అద్దేపల్లికి చెందిన టైలర్లు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనలు



సైన్స్ ఎక్స్‌పోను తిలకిస్తున్న బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారి రాఘవయ్య



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న తహసీల్దార్

రేపల్లె రూరల్: విద్యార్థులలో నైపుణ్యాలు వెలికి తీసేందుకు సైన్స్ విజ్ఞాన ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయని రేపల్లె బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారి వసంతం వీర రాఘవయ్య అన్నారు. సైన్స్‌డే సందర్భంగా పట్టణంలోని శ్రీ చైతన్య స్కూలులో బుధవారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. చదివిన దాని కంటే ప్రయోగాత్మకంగా ఆ అంశంపై పట్టు సాధిస్తే పది కాలాల పాటు మదిలో ఉంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన విజ్ఞాన ప్రదర్శనలు తిలకించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.రామాంజనేయులు, డీన్ ఎం.నాగ సునీత, ఏవో రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవ జీవితంలో సైన్సుకు ప్రాధాన్యం

చెరుకుపల్లి: మానవుని జీవితంలో సైన్స్ కీలక పాత్ర పోషిస్తుందని హెచ్‌ఎం కె కవిత పేర్కొన్నారు. మండలంలోని గుళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం చిన్నారులు తయారు చేసిన సైన్సు ప్రదర్శనను ఏర్పాటు చేశారు. విద్యార్థులు విద్యతో పాటు సైన్స్ పట్ల అవగాహన పెంచుకొని ఉన్నత శిఖరాలు అందుకోవాలని సూచించారు. భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి గ్రహీత సర్ సీవీ రామన్ చేసిన సేవలకు గుర్తుగా ప్రతి ఏటా ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకోవటం జరుగుతుందన్నారు. పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన నమూనాలను ఉపాధ్యాయులు, విద్యార్థులు క్రమ పద్ధతిలో తిలకించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ మంచాల విజయ్ కిషోర్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వాకా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు సైన్సుపై మక్కువ పెంచుకోవాలి

కర్లపాలెం: విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలని తహసీల్దార్ నిర్మలానంద బాబా సూచించారు. సైన్స్ డేను పురస్కరించుకుని విద్యాశాఖ ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో కర్లపాలెం హైవెండ్ హైస్కూల్ విద్యార్థులు మండల స్థాయిలో బహుమతులు గెలుచుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం హైవెండ్ హైస్కూల్‌లో జరిగిన సైన్స్‌డే సందర్భంగా తహసీల్దార్ నిర్మలానందబాబా, ఎంఈవో విజయశ్రీ విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ సైన్స్ ద్వారానే ప్రపంచం వేగంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, హైవెండ్ హైస్కూల్ చైర్మన్ ఉదయ్‌చంద్రరావు, డైరెక్టర్లు సాయి మహేంద్రబాబు, పెదమల్లు చాందినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం

భట్టిప్రోలు: భట్టిప్రోలు టీఎంఆరావు హైస్కూల్‌లో బుధవారం ఘనంగా సైన్స్ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయులు సి. రామకోటేశ్వరరావు మాట్లాడుతూ నోబెల్ బహుమతి గ్రహీత సీవీ రామన్ ప్రపంచానికి రామన్ ఎఫెక్ట్‌ను అందించిన రోజును భారత ప్రభుత్వం జాతీయ సైన్స్ దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. నిత్య జీవితంలో సైన్స్ ఉపయోగాలపై ఉపాధ్యాయులు క్విజ్ పోటీలు నిర్వహించారు.

గడువులోగా సర్వే పూర్తి చేయాలి

పరిశ్రమల ప్రోత్సాహక అధికారి సురేంద్ర

చెరుకుపల్లి: గ్రామాల్లో నిర్వహిస్తున్న అన్ని రకాల పరిశ్రమలను గుర్తించి ప్రభుత్వం నిర్దేశించిన యాప్‌లలో పొందు పరచాలని బాపట్ల జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక అధికారి సురేంద్ర పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం రేపల్లె, వేమూరు నియోజక వర్గాల పరిధిలోని 124 మంది సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు ఎంఎస్ఎంఈ సర్వేపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు ఆయా సచివాలయాల పరిధిలో ఉన్న చిన్న,పెద్ద పరిశ్రమలను గుర్తించి మార్చి 1నుంచి 31 లోపు సర్వే పూర్తి చేసి యాప్‌లో అప్‌లోడ్ చెయ్యాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సాధారణ సమావేశం

రేపల్లె రూరల్: పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించబడునని మున్సిపల్ కమిషనర్ శేషాద్రి బుధవారం ఒక ప్రటకనలో తెలిపారు. చైర్‌పర్సన్ కట్టా మంగ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

రేపల్లె రూరల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మండలంలోని పోటుమెరక, లంకెవానిదిబ్బ, గంగడిపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ ఏడీఈ ఎస్.భాస్కరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు భట్టిప్రోలులో విద్యుత్ సరఫరా నిలుపుదల

భట్టిప్రోలు: భట్టిప్రోలు, పెదపులివర్రు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తునట్లు ఇన్‌చార్జ్ ఏఈ పి.ఏడుకొండలు బుధవారం తెలిపారు. రేపల్లె 33/11 కేవీ లైన్ మరమ్మతులు నిర్వహిస్తున్న కారణంగా సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత

కర్లపాలెం: రాష్ట్ర మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి కుమారుడు వైఎస్సార్ సీపీ నేత గాదె మధుసూదనరెడ్డి శివస్వాములకు రూ.25వేల నగదు అందజేశారు. కర్లపాలెం అగ్రహారంలోని గంగా, గౌరీ సమేత బదరీ కేదారేశ్వరస్వామి ఆలయంలో శివ స్వాములు 41రోజుల అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి గాదె మధుసూదనరెడ్డి విరాళం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మరుప్రోలు శివారెడ్డి, డేగల రవిరెడ్డి, అల్లం గోపీకృష్ణ, గోవతోటి విజయ్, శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆక్వా రైతులకు నూతన మార్గదర్శకాలు విడుదల

వివరాలు వెల్లడించిన మత్స్యశాఖ జేడీ



మత్స్యశాఖ జేడీఏ సురేష్

బాపట్లటౌన్: ఆక్వా రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని మత్స్యశాఖ జేడీఏ సురేష్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ చట్టం 2005ను 2023 ఆగష్టు 12న సవరణ చేయడం జరిగిందని దీనికి సంబంధించిన నూతన మార్గదర్శకాలు ఈ ఏడాది జనవరి 9 నుంచి అమల్లోకి వచ్చాయన్నారు. ఆక్వా చెరువుల విస్తీర్ణం 5 హెక్టార్ల వరకు ఆర్డీవో ఆధ్వర్యంలో సిఫార్సు చేయవచ్చన్నారు. 5 హెక్టార్ల విస్తీర్ణం కంటే ఎక్కువ ఉన్న చెరువులకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కమిటీ కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీకి సిఫార్సు చేయాలన్నారు. అసైన్డ్ భూములు, సొసైటీ భూముల్లో ఉన్న చెరువులకు రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించారన్నారు. ఆక్వా చెరువులను కొనుగోలు చేసిన రైతుల పేరు మీదకు లైసెన్స్‌లను బదిలీ చేసుకోవచ్చన్నారు.

అర్హులకు స్త్రీనిధి రుణాలు అందివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగబాబు

భట్టిప్రోలు: స్త్రీ నిధి రుణాలకు ఎవరైతే దరఖాస్తు చేసుకుంటారో వారికే నిధులు మంజూరయ్యేలా చూడాలని జిల్లా స్త్రీ నిధి ఏజీఎం నాగబాబు పేర్కొన్నారు. భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం వైఎస్సార్ క్రాంతిపథం మండల సమాఖ్య అధ్యక్షురాలు జాలాది ధనలక్ష్మి అధ్యక్షతన యానిమేటర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ సభ్యులు చెల్లించే అన్ని రకాల లావాదేవీలు సక్రమంగా ఉండాలన్నారు. జిల్లా ఐబీ ఏపీఎం మాచవరపు రమేష్‌బాబు మాట్లాడుతూ మండల పరిధిలో పాడి పరిశ్రమ, కుట్టు మిషన్లపై జీవనం కొనసాగించే లబ్ధిదారులను గుర్తించి వారికి రుణాలు ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ పి.రమాదేవి, ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, స్త్రీ నిధి మేనేజర్ పిల్లి అశోక్‌బాబు, సీసీలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ప్రజావేదిక

నగరం: ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య చెప్పారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రజావేదికలో ఎంపీపీ పాల్గొని మాట్లాడారు.మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.8.45 కోట్ల నిధులతో ఉపాధి హామీ పథకం కింద పనులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పనుల నిర్వహణపై సామాజిక తనిఖీ బృందాలు విచారణ చేసినట్లు పేర్కొన్నారు. సామాజిక తనిఖీలపై ప్రజావేదిక నిర్వహించినట్లు వెల్లడించారు. డ్వామా పీడీ బి అర్జునరావు, ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, సామాజిక తనిఖీ బృందాల ప్రతినిధులు, ఎస్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ సారథి జగనన్నకు అండగా నిలుద్దాం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి



ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ ఈవూరి గణేష్, కేశవతి

రేపల్లె రూరల్: సంక్షేమ సారథి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ తోడుగా నిలవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. సిద్ధం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పేటేరు గ్రామంలో నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. గ్రామాలను సైతం పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గ్రామాల్లో పాలనా వ్యవస్థను నెలకొల్పి ప్రభుత్వ సేవలను ప్రజల చెంతకు చేర్చారన్నారు. ప్రజలు పట్టణాలకు పరుగులు తీయకుండా సచివాలయాల ద్వారా అవసరమైన సేవలు పొందేలా గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల అవసరాలను తీర్చుతున్నారన్నారు. సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరి చెంతకు చేర్చుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ ఈవూరి కేశవతి, సృజన్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి నిరంతర కృషి



ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వరికూటి అశోక్‌బాబు

తురిమెళ్ల(వేమూరు): గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. అమర్తలూరు మండలంలోని తురిమెళ్ల గ్రామంలో ఆయన బుధవారం పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. వలంటీర్ల పని విధానం గురించి ఆరా తీశారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా గ్రామ సచివాలయానికి నిధులు కేటాయించడం జరిగిందన్నారు. ఈ నిధులతో రోడ్లు వేయడం జరుగుతుందని వివరించారు. స్మశాన వాటికలకు సైతం ప్రభుత్వం నిధులు కేటాయించడం జరిగిందన్నారు. గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్య

అమర్తలూరు(వేమూరు): చెరుకుపల్లి గ్రామానికి చెందిన బండారు వీరాచార్యులు(40) అమర్తలూరు మండలంలోని గోవాడ గ్రామ సమీపంలోని పెట్రోలు బంక్ వద్ద పురుగుల మందు తాగి బుధవారం మృతి చెందాడు. ఇతనికి భార్య, కుమార్తె ఉన్నారు. పోలీసుల సమాచారం మేరకు గత కొన్ని నెలలుగా మతి స్థిమితం లేక వీరాచార్యులు తెనాలి మండలంలోని ఎరుకలపూడి గ్రామంలో మానసిక వైద్యశాలలో చికిత్స పొందడం జరిగింది.ఈ క్రమంలో మందుల కోసం ఎరుకల పూడి గ్రామానికి బయలుదేరి వెళ్లాడు. మందులు తీసుకొని వస్తాడని ఎదురు చూస్తున్నామని భార్య తెలిపినట్లు ఎస్ఐ నవీన్ కుమార్ తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు గాలింపు చేయగా గోవాడ సమీపంలో మృతి చెందినట్లు గుర్తించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.